ప్రజాశక్తి

ఆదివారం 13 నవంబర్ 2022

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

మౌలిక సదుపాయాల కల్పనతోనే ప్రగతి

◆ విశాఖ సభలో ప్రధాని మోడీ ◆ పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
◆ సభకు భారీగా జనాన్ని తరలించిన రాష్ట్ర ప్రభుత్వం



రిమోట్‌తో ప్రాజెక్టులను ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ, చిత్రంలో గవర్నర్, సిఎం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

మౌలిక సదుపాయాల కల్పనతోనే దేశ ప్రగతి సాధ్యమని ప్రధాని మోడీ అన్నారు. విశాఖపట్నానికి చాలా విశిష్టమైన వర్తక, వ్యాపార సంప్రదాయాలు ఉన్నాయని, ఇదో అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు అన్ని రంగాల్లో తమకంటూ ఒక ప్రముఖ పేరు తెచ్చుకున్నారని కితాబిచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లతో కలసి ఆయన శనివారం రూ.10,742 కోట్ల విలువైన బహుళ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో విశాఖపట్నం ఒక ముఖ్యమైన ఓడరేవుగా పేరుగాంచిందన్నారు. బ్లూ ఎకానమీపై ప్రభుత్వ దృష్టిని ఆయన నొక్కి చెప్పారు. సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ 'చారిత్రక ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణంలో ఒకవైపు సముద్రం కనిపిస్తోంది, మరోవైపు జనసముద్రం కనిపిస్తోంది' అని అన్నారు. కార్తీక పౌర్ణమివేళ ఎగసిపడిన కెరటాలకు మించి ఈరోజు జనకెరటం ఇక్కడ ఉవ్వెత్తున ఎగిసిపడుతూ కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఇక్కడకి వచ్చిన జనాభాను చూస్తుంటే ప్రజాకవి, గాయకుడు వంగపండు చెప్పినట్టుగా..పాడినట్టుగా.. ఆయన మాటలు గుర్తుకొస్తున్నాయన్నారు. ఏం పిల్లడో ఎల్దామొస్తవా అన్న పాటను గుర్తు చేశారు. ఇదే నేలమీద నడియాడిన మహాకవి శ్రీశ్రీ మాటల్లో చెప్పాలంటే.. వస్తున్నాయ్.. వస్తున్నాయ్ జగన్నాథ

మిగతా 2లో..



స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద నిరసన తెలుపుతున్న సిహెచ్.నర్సింగరావు, ఉక్కు కార్మికులు

'ఉక్కు' ప్రయివేటీకరణపై..

వెల్లువెత్తిన నిరసనలు

◆ పోలీసు అడ్డంకులను అధిగమిస్తూ మద్దిలపాలెం వద్ద రాస్తారోకో
◆ 40 మంది అరెస్టు
◆ స్టీల్‌ప్లాంట్ గేట్లు వద్ద, కర్మాగారంలోనూ నిరసన తెలిపిన ఉక్కు కార్మికులు



మద్దిలపాలెంలో సిపిఎం మహిళా నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

▶ వార్త మెయిన్‌లో..

రాష్ట్ర రాజకీయాలకు వేదికైన విశాఖ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాజకీయాలకు అతీతంగా ఏదైనా ఉంటుందా ? అంటే ఉండకపోవచ్చు.. అనే మాట సర్వత్రా వెల్లడవుతోంది. తాజాగా విశాఖను రాజకీయాలు కుదిపేస్తున్నాయి. అయితే అవి ఏ రాజకీయాలు ? ప్రజా సమస్యల పరిష్కారం దిశగా సాగుతున్నవా ? పార్టీలు వారి వారి ప్రాపకం, ఉనికిని కాపాడుకునే యత్నాల్లో భాగంగా రాజకీయాలను ఆడిస్తున్నాయా ? అంటే అటూ ఇటూ రెండూ ఉన్నాయనే చెప్పొచ్చు. రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ చోటుచేసుకోని ఘటనలు, సన్నివేశాలు, సమావేశాలు, సభలకు విశాఖ వేదికగా మారిందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. గడచిన రెండు రోజులూ దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ విశాఖలోనే ఉన్నారు. బిజెపి ఇదో పెద్ద సంబరంగా, సంతోషంగా చెప్పుకోవడం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం, వైసిపి కూడా అంతా తన భుజాన వేసుకుని ప్రధాని సభ విజయవంతానికి కృషి చేశాయి. ఇటీవల విశాఖ పర్యటనకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రావడం, వైసిపి శ్రేణులు 'మూడు రాజధానుల కోసం' విశాఖ గర్జన సభ జరపడం.. విమానాశ్రయంలో గలాటా చోటుచేసుకోవడంతో రాష్ట్రంలో రాజకీయ వివాదానికి విశాఖ వేదికైంది. తాజా పర్యటన విశేషాలను చూస్తే ఈ ఘటనలన్నిట్లోనూ ప్రధానంగా వైసిపి, జనసేన, బిజెపి కనిపిస్తుండగా ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం మాత్రం కాస్త ఒంటరైందనే చెప్పాలి.ఆ పార్టీ నేతలు సమావేశాలు, మీడియాకు వీడియోలు విడుదల చేయడం మినహా ప్రత్యక్ష కార్యాచరణ రాజకీయంగా చేసిందేమీ లేదు.

ప్రజా రాజకీయ అజెండా ఎవరిది ?

ప్రధాన ప్రజా సమస్యల అజెండా అయిన ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధికి కీలకమైన 'విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాలన్న తపన మాత్రం ఈ పార్టీలు వేటిలోనూ ఇసుమంతైనా కానరాలేదు. ఇది వారి రాజకీయం. సిపిఎం ఇతర వామపక్షాలూ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక, ప్రజాసంఘాలు, అఖిలపక్ష కార్మిక సంఘాల జెఎసి వంటివి మాత్రం స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలన్న తపనతో కార్యాచరణతో గడచిన వారం రోజులుగా కదిలాయి. వాల్తేరు రైల్వే డివిజన్‌ను కొనసాగిస్తూ కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేయాలంటూ సిపిఎం గట్టిగా పోరాడుతోంది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి కీలక ప్రాజెక్టును పూర్తిచేస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందంటూ అభివృద్ధి వేదిక పోరాడుతూనే ఉంది. విభజన హామీలు అమలు చేస్తేనే ఈ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి అవుతుందని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ దీంట్లో భాగమేనంటూ పెద్ద ఎత్తున కార్యక్రమాలను చేస్తూనే గడచిన వారంలో మరింత ఉధృతంగా సాగించాయి. ప్రజా రాజకీయ అజెండాతో ఇవన్నీ విశాఖ కేంద్రంగా నిర్వహించబడ్డాయి.

వివాదాలే ప్రధాన పార్టీల అజెండా

రుషికొండ పర్యటనకే



తెలుగుదేశం, జనసేన, బిజెపిలు పెద్దపీట వేస్తున్నాయి. రుషికొండ దరిదాపుల్లోకి రాకుండా అధికారంతో వైసిపి వీరిని అడ్డుకుంటోంది. అక్కడ ఏం జరిగింది? జరుగుతుందో ? ప్రజానీకానికి పెద్ద అవసరం లేకపోయినా ఎక్కడకు తాము వెళితే వార్తల్లోకి వస్తామో వాటినే ప్రతిపక్షాలు ఎత్తుకోవడం ఈ ప్రాంత ప్రజల దురదృష్టమనే చెప్పాలి. ఈ పర్యటనలు వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించడం కోసమో? వాల్తేరు రైల్వే డివిజన్‌ను నిలబెట్టుకునే పోరాటం కోసమో? ఉత్తరాంధ్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులివ్వకుండా నిర్లక్ష్యం చేస్తోన్న వైనంపై నిలదీయడానికో ఉంటే బాగుండేది. ఈ ప్రాంత అభివృద్ధి అజెండా రాజకీయ చర్చల్లోకి వచ్చేది. వీరికేమీ పట్టడం లేదు. వీరేం చేసినా అడ్డుకుంటూ అధికార బలగాలను ప్రయోగించే పనిలో వైసిపి నిమగ్నమైంది. ఇవన్నీ ప్రజానీకం గమనిస్తూనే ఉన్నారన్నది ఈ పార్టీలు ఎవరికి వారు తెలుసుకున్నా వారికి అంతకు మించిన అవసరం కళ్లముందు లేదన్నది స్పష్టమవుతోంది. వివాదాలు రేపే ఉద్వేగ భరిత కార్యాచరణకే ప్రాధాన్యమిస్తున్నాయి.

విశాఖ భారీ సభతో జనాలకు ఒరిగిందేమిటి?

రాష్ట్రంలో వివాదాలు, విద్వేషాలకు నిలయంగా విశాఖ మారడానికి ఇక్కడ కొనసాగుతున్న పరిణామాలు అందులో ప్రధాన రాజకీయ పార్టీల పాత్ర (వామపక్షాలు మినహా) స్పష్టంగా కనిపిస్తోంది. విశాఖకు దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ వచ్చిన సందర్భంలో అధికార వైసిపి ఇది ప్రభుత్వ కార్యక్రమం అంటూ డ్వాక్రా, అంగన్‌వాడీ, ఇతర చిరు ఉద్యోగులు, ముఖ్యంగా గ్రామాలు, వార్డుల్లోగల మహిళలను పెద్ద ఎత్తున టార్గెట్ చేసి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వాహనాల్లో తరలించింది. వాస్తవానికి ప్రధాన మంత్రి ప్రారంభించిన ప్రాజెక్టులకూ వీరి జీవితాలకూ ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ మేలు జరిగేదేమైనా ఉందంటే అది 'కనపులో సూది గుండు ఏరుకున్నంత మాత్రమే'... రాష్ట్రానికి ప్రయోజనకరమైన, పెండింగ్ సమస్యలైన రైల్వే జోన్, భోగాపురం ఎయిర్‌పోర్టు, మెట్రోరైలు వంటివి, ఉత్తరాంధ్రకు చెందిన వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు, సుజల స్రవంతి, వైజాగ్‌స్టీల్‌ప్లాంట్‌పై స్పష్టమైన, ఉపయోగకరమైన ప్రకటన ఉంటేనే ఆశలకు కాస్తయినా అర్థం ఉండేది.

ఈనెల 11న జనసేన అధినేత పవన్ మోడీ భేటీ కాస్త రాజకీయ ప్రకంపనలు వైసిపిలో సృష్టించిందనే చెప్పొచ్చు. బిజెపి రాష్ట్ర నేతలే మోడీని పవన్ కలిసేలాగ ఏర్పాటు చేసినట్లు గొప్పగా చెప్పుకోవడం విశేషం. ఎందుకంటే మోడీ సభా ఏర్పాట్లలో వైసిపి శ్రేణులు ముఖ్యంగా విజయసాయిరెడ్డి, వై.వి.సుబ్బారెడ్డి స్థానిక వైసిపి నేతలతో నవంబర్ 1 నుంచి పెద్ద ఎత్తున జనసమీకరణ, ఇతర పనులన్నీ స్వయంగా చూడడం బిజెపి నేతలంతా తమ పార్టీ ప్రధాని సభకు వీరి హంగామా ఏమిటంటూ బాహాటంగానే గంగవెర్రులెత్తారు. ఆ పార్టీ అధ్యక్షులు సోము వీర్రాజు విశాఖ వీధుల్లో బిజెపి జెండాలను జివిఎంసి వాళ్లు పీకేశారని.. వారికి విజయసాయిరెడ్డి ఆదేశాలున్నాయని రోడ్డుపై వీరంగం సృష్టించారు.

మొదటి పేజీ తరువాయి..

మౌలిక సదుపాయాల కల్పనతోనే ప్రగతి

రథచక్రాలొస్తున్నాయ్ అంటూ కదిలివస్తున్న లక్షల జనసందోహం తన కళ్ల ముందు కనిపించిందన్నారు. దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అన్న విజయనగరం వాసి, మహాకవి గురజాడ మాటలు మనందరికీ కర్తవ్య బోధ చేస్తున్నాయన్నారు. ఎనిమిదేళ్ల క్రితం తగిలిన అతిపెద్ద గాయం నుంచి ఆంధ్రప్రదేశ్ ఇంకా కోలుకోలేదన్నారు. కేంద్ర రైల్వే శాఖామంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ ఎపికి కేటాయించిన ఆర్థిక వనరులు, చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులను వివరించారు. విశాఖపట్నం రైల్వేస్టేషన్, ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ, అప్ గ్రేడేషన్ కొరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

భారీ ఏర్పాట్లు

ప్రధాని మోడీ బహిరంగ సభకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. ఈ ఏర్పాట్లలో భాగంగా ప్రధాన సభా వేదిక ఏర్పాటు చేసిన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో మొత్తం ఏడు మార్గాల ద్వారా అతిథులు, ప్రజలు సభాస్థలికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. సభాస్థలికి ప్రజలను విశాఖపట్నంలోని 98 వార్డుల నుంచి తరలించారు. విజయనగరం పార్వతీపురం అనకాపల్లి, శ్రీకాకుళం అల్లూరి జిల్లాల నుంచి ఆర్టీసీ బస్సులు, స్కూళ్లు, కాలేజీలు, ఫార్మా కంపెనీలకు చెందిన బస్సులను జనాల తరలింపునకు ఉపయోగించారు. సభ ప్రారంభమై ముగిసే సమయానికి కూడా చాలామంది ప్రజలు బస్సుల్లో సభా స్థలానికి చేరుకుంటూనే ఉన్నారు. ప్రధాన వేదిక మీద ఉన్న అతిథులు అందరికీ కనపడే విధంగా సుమారు 500 ఎల్ఇడి స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.

సభ అనంతరం తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రజలు

ఇదంతా ఒక ఎత్తైతే సభ ముగిసిన అనంతరం అధికారులు, పోలీసు యంత్రాంగం ప్రజలను గాలికి వదిలేసింది. ప్రజలు బయటికి వచ్చే క్రమంలో దారులు తెలియక ఇబ్బందులు పడ్డారు. ఏ బస్సు ఎక్కి తమ ప్రాంతాలకు తిరిగి వెళ్ళాలో తెలియక సతమతమయ్యారు. మద్దిలపాలెం నుండి సత్యం జంక్షన్ వరకు ప్రజలు రోడ్లపై గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది వారికి సరైన సమాచారం ఇచ్చేవారు కరువయ్యారు. సాయంత్రం నాలుగు గంటలు అవుతున్నప్పటికీ వేలాదిమంది మద్దిలపాలెం, సత్యం జంక్షన్, పోలమాంబ గుడి, పెద్ద వాల్తేరు ప్రాంతాలలోనే కనిపించారు. ప్రజలను సభకు సమీకరించేటప్పుడు తీసుకున్న శ్రద్ధను సభ ముగిసిన తరువాత ఎవ్వరూ చూపలేదు.

తెలుగుజాతి ప్రయోజనాలు తాకట్టు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పలు అక్రమ ఆస్తుల కేసులలో అరెస్టు కాబడి బెయిల్‌పై ఉన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బెయిల్ రద్దు అవుతుందనే భయంతో తెలుగుజాతి ప్రయోజనాలను ప్రధాని మోడీ వద్ద తాకట్టు పెట్టారని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నాడు మెడలు వంచుతానని ప్రగల్భాలు పలికి, నేడు విజ్ఞప్తులకే జగన్మోహన్ రెడ్డి పరిమితమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని ప్రసంగించిన సభలో తాను పాస్ పొంది పాల్గొనగా, సిఐ రాంబాబు, ఎస్ఐ సత్యనారాయణ తన వద్దకు వచ్చి ఎస్‌పి రమ్మంటున్నారని చెప్పి సభ నుంచి తనను తీసుకెళ్లే ప్రయత్నం చేశారని చెప్పారు. తనను అవమానించారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు 639 రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నా ముఖ్యమంత్రికి చీమకుట్టినట్టుగా కూడా లేదన్నారు. రాష్ట్ర విభజన తర్వాత మిగిలిన అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ ఉక్కు కర్మాగారం చేజారిపోతుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విజ్ఞప్తులకే పరిమితం కావడం సరికాదన్నారు.

కొత్త ప్రాజెక్టులేవీ ?

- టిడిపి మాజీ మంత్రి బండారు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రధాని మోడీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసినవన్నీ గతంలో మంజూరు కాబడినవేనని, వాటికి సంబంధించిన పనులు ప్రస్తుతం జరుగుతున్నాయని, అయితే.. ఇవన్నీ వైసిపి ప్రభుత్వం సాధించినవని అర్థం వచ్చేలా ముఖ్యమంత్రి జగన్, ఎంపీ విజయసాయిరెడ్డి డబ్బా కొట్టుకుంటున్నారని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి విమర్శించారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రత్యేక హోదా తెచ్చారా, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా హామీ సాధించారా, రైల్వే జోన్ భవనం శంకుస్థాపన ఏమైంది ? అని ప్రశ్నించారు. టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మోడీ శంకుస్థాపన చేసిన ఏ ఒక్క ప్రాజెక్టూ ముఖ్యమంత్రి జగన్ తెచ్చింది కాదన్నారు. పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ గండి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

సొంత డబ్బా కొట్టుకున్న ప్రధాని మోడీ : సిపిఐ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోడీ సొంత డబ్బా కొట్టుకునేందుకు ప్రయత్నించారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి విమర్శించారు. విశాఖలో ప్రధాని మోడీ పర్యటన ముగిసిన తరువాత అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో చేసిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల వల్ల విశాఖకు ఏదో ఒనగూరుతుందని చెప్పారని, వాస్తవానికి వాటి వల్ల పెద్ద ప్రయోజనం లేదని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల గురించి ప్రధానిని ముఖ్యమంత్రి జగన్ గట్టిగా అడగలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. ప్రధాని సభకు డ్వాక్రా మహిళలను బెదిరించి తరలించారని విమర్శించారు. సమావేశంలో పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, నాయకులు ఎ.విమల, ఎస్‌కె.రెహమాన్, క్షేత్రపాల్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులపై ఖండన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మోడీ పర్యటన నేపథ్యంలో కార్మికులను, ప్రజా సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని పబ్లిక్ సెక్టార్ కో - ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో ఖండించారు. మోడీ సభ విశాఖ, ఎపి రాష్ట్ర ప్రజల్లో తీవ్ర నిరాశను మిగిల్చిందన్నారు. అక్రమ అరెస్టులను డివైఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్.రాజు, సంతోష్ ఓ ప్రకటనలో ఖండించారు.

సంగీత ప్రవీణ జోగులాంబ మృతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగరానికి చెందిన ప్రముఖ సంగీత విద్యా ప్రవీణ మల్లాప్రగడ జోగులాంబ శనివారం తెల్లవారుజామున మరణించారు. ఆమె దేశ విదేశాలలో విరివిగా పర్యటించి అనేక సంగీత కచేరీలు నిర్వహించారు. పలు అవార్డులు అందుకున్నారు. సంగీత కళా సాగర వంటి విశిష్ఠ అవార్డు అందుకున్న జోగులాంబ వీణా నిలయ విద్వాంసులుగా ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలో రెండు దశాబ్దాలు పైబడి సేవలందించారు. లబ్దప్రతిష్ఠులైన శిష్యులను తయారు చేశారు.

విశాఖ సాక్షిగా కేంద్రం మరోసారి ద్రోహం

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక, సిపిఎం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్, అనకాపల్లి

విశాఖ సాక్షిగా కేంద్రం మరోసారి ద్రోహానికి పాల్పడిందని, శనివారం జరిగిన బహిరంగ సభలో ప్రధాన మంత్రి మోడీ ప్రజల ఆకాంక్షలను కనీసంగా కూడా ప్రస్తావించలేదని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక, సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లా కమిటీలు తెలిపాయి. ప్రధాని సభ మొక్కుబడిగా సాగిందని పేర్కొన్నాయి.

సభలో మొక్కుబడిగా ముఖ్యమంత్రి ప్రత్యేక హోదా, స్టీల్‌ప్లాంట్ అంశాలను ప్రస్తావించినా, ప్రధాని నుంచి కనీస స్పందన కూడా లేదని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. ఇది రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని తెలిపారు. ప్రధాని సభా వేదిక నుంచి ప్రారంభించినవేవీ ఈ ప్రాంత ప్రజలు కోరుకున్నవి కావన్నారు. ఫిషింగ్ హార్బర్, విశాఖపట్నం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ వంటివన్నీ వారి కార్పొరేట్ మిత్రులకు సిరులు కురిపించడానికేనన్నారు. కొన్ని ఇప్పటికే పూర్తయిపోయినవేనని తెలిపారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్, స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిర్ణయం ఉపసంహరణ వంటి కనీస ప్రకటనలైనా ప్రధాని నుండి వస్తాయని ఆశించిన కొంతమంది ఆశలను కూడా ఆయన అడియాసలు చేశారన్నారు. వెనుకబడ్డ జిల్లాలకు తమ ప్రభుత్వం ఏదో చేసేసిందని ప్రధాని గొప్పలు చెప్పుకున్నారుగానీ, చట్ట ప్రకారం ఉత్తరాంధ్రకు రావలసిన నిధులు ఇవ్వలేదన్న సంగతి దాచేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సందర్భంగా చేసిన హడావుడి అత్యంత గర్హనీయమన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులపైనా, దీక్షా శిబిరంలోని మహిళలపైనా అమానవీయంగా నిర్బంధం ప్రయోగించడం ఆక్షేపణీయమని తెలిపారు. ఇలా చేయడం ద్వారా రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి దాసోహం అయినట్లయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఈ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

మోడీకి లొంగిపోయిన రాష్ట్ర ప్రభుత్వం

రాష్ట్ర ప్రయోజనాలకు తిలోదకాలిచ్చి మోడీకి రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోయిందని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. వైసిపి, తెలుగుదేశం, జనసేనల అవకాశవాద రాజకీయాలను మరోసారి మోడీ పర్యటన బయటపెట్టిందన్నారు. సిపిఎం, సిపిఐ, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను రద్దు చేయాలన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ సభలో విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని ఉపసంహరిస్తున్నట్లు, ఏపి పునర్విభజన చట్టం అమలు చేస్తున్నట్లు ప్రకటన చేయకపోవటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విశాఖలో అడుగడుగునా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించిందన్నారు. రూ.10 వేల కోట్లు పెట్టుబడులకు శంకుస్థాపనలు చేశారని వైసిపి నేతలు చెబుతున్నారు తప్ప రూ.3 లక్షల కోట్లు విలువ చేసే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తుంటే పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీలు రాష్ట్ర అభివృద్ధిపై మాట్లాడకుండా తమ విధేయతను చాటుకున్నాయని తెలిపారు.

ప్రధాని సభ గ్రాండ్ సక్సెస్ : బొత్స, అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రధాని మోడీ పర్యటన, సభ విశాఖలో గ్రాండ్ సక్సెస్ అయ్యాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శనివారం సాయంత్రం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని బహిరంగ సభకు ఉత్తరాంధ్ర వాసులంతా తరలి వచ్చారన్నారు. వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సభలో సిఎం వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ విధానాన్ని, పెండింగ్ సమస్యలను స్పష్టంగా, క్లుప్తంగా వివరించారన్నారు. వాటన్నింటినీ పరిష్కరించాలని ప్రధానిని కోరారన్నారు. తమకు రాజకీయాలు, పార్టీలు ముఖ్యం కాదని, రాష్ట్ర శ్రేయస్సు ముఖ్యమని స్పష్టం చేశారు. పవన్‌పై పలు విమర్శలు చేశారు. ఈనాడు పత్రిక దిగజారి వార్తలు రాస్తోందన్నారు. రుషికొండపై గతంలో ఒక టూరిజం గెస్ట్ హౌస్ ఉందని, నేడక్కడ ఆ శాఖ కొత్త భవనాలు కడుతోందని, తప్పేమిటని ప్రశ్నించారు. మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో ఇంతటి భారీ సభను చూడలేదన్నారు. సమావేశంలో విశాఖపట్నం ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, వైసిపి జిల్లా అధ్యక్షులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొన్నారు.

న్యుమోనియా పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి-ఆనందపురం : ఐదేళ్లలోపు పిల్లల మరణాలకు ప్రధాన కారణమైన న్యుమోనియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ షేక్ షహనాజ్ సాది సూచించారు. న్యుమోనియా దినోత్సవం సందర్భంగా గంభీరం సచివాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, న్యుమోనియా ఒక ప్రమాదకర వ్యాధి అన్నారు. ఐదేళ్ల లోపు పిల్లల మరణాలకు అతి ముఖ్యమైన కారణం న్యుమోనియా అని తెలిపారు. న్యుమోనియా లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రికి తీసుకురావాలని చెప్పారు. జలుబు ఎక్కువగా ఉండటం, ఎక్కువసార్లు వేగంగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకునే సమయంలో డొక్కలు ఎగరవేయడం, నీరు తాగలేకపోవడం, శ్వాస తీసుకునే సమయంలో గురక రావడం, నీరసంగా మత్తుగా ఉండడం న్యుమోనియా లక్షణాలు అని పేర్కొన్నారు. దీని నుంచి రక్షణకు సమయానుసారంగా టీకాలు వేయించాలని చెప్పారు. తాగునీటి పాత్రలపై మూతలు పెట్టాలని, బయటకు వెళ్లి వచ్చినప్పుడు చేతులు శుభ్రపరుచుకోవాలని, రాత్రి వేళలో పిల్లలకు దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్యపర్యవేక్షకులు పి.సన్యాసిరావు, ఆరోగ్య కార్యకర్తలు సత్యవతి, అప్పలరాజు, గంగాదేవి, సిహెచ్.సాయిగౌతమి, ఆశా కార్యకర్త వరలక్ష్మి పాల్గొన్నారు.

నేడు చందకలో ఉచిత గుండె వైద్యశిబిరం

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని చందక గ్రామంలో ఇండస్ హాస్పిటల్ ఆధ్వర్యాన ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ బుజ్జి తెలిపారు. శిబిరంలో గుండెకు సంబంధించిన ఇసిజి తదితర పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ వి.సుజాత, డాక్టర్ ఎం.నరసింహారెడ్డి, డాక్టర్ ఎం.రమేష్‌నాయుడు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చందక రామాలయం వద్ద శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9440334635ను సంప్రదించాలని సూచించారు.

ట్రైన్ కాదండోయ్.. !

ప్రజాశక్తి - ఆరిలోవ :రోడ్డు మీద ట్రైన్ ఉందేంటి అనుకుంటున్నారా? అదేమీ ట్రైన్ కాదండీ.. బస్సులే... బస్సులను వరుసగా పార్కింగ్ చేయడంతో అలా కనిపిస్తోంది. ఏయు ఇంజినీరింగు మైదానంలో మోడీ బహిరంగ సభకు ఉభయ గోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, ఉమ్మడి విశాఖ జిల్లాల నుంచి జనాన్ని తీసుకొచ్చిన బస్సులే అవి. బహిరంగ సభకు జనాన్ని తరలించాక, అక్కడ పార్కింగ్ ప్రదేశం చాలకపోవడంతో హనుమంతువాక నుంచి అడివివరం వెళ్లే బిఆర్‌టిఎస్ రోడ్డులో ఆర్‌టిసి, కాలేజీ, స్కూలు బస్సులను శనివారం ఇలా పార్కింగ్ చేశారు. హనుమంతువాక నుంచి కేంద్రకారాగారం వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరం వరకు బస్సులను ఇలా పార్కింగ్ చేయడంతో చూపరులకు రోడ్డుపై బోగీలతో కూడిన రైలును పార్కింగ్ చేసినట్లు కనిపించింది.



ట్రైన్‌లా కనిపిస్తున్న బస్సుల పార్కింగ్

గంభీరంలో డెంగీ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం సచివాలయం యాతపేట ఎస్‌టి కాలనీలో డెంగీ కేసు నమోదైంది. గ్రామానికి చెందిన సిహెచ్.ఆశ (28) జ్వరంతో బాధపడుతూ పరీక్షలు చేసుకోగా డెంగీ నిర్ధారణ అయింది. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గ్రామంలో పర్యటించి జ్వరాలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించారు. గ్రామ పరిసరాల్లో క్లోరినేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్యాధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు సన్యాసిరావు, ఆరోగ్యకార్యకర్తలు ఎం.సత్యవతి, అప్పలరాజు, ఆశా కార్యకర్తలు కొండమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమునిపట్నం సెయింట్ ఆన్స్ పాఠశాల క్రీడా ప్రాంగణంలో 47వ ఏపి యోగాసన ఛాంపియన్ షిప్ -2022 పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఏపి యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.అవినాష్, విశాఖ జిల్లా అధ్యక్షులు రవి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి యు.రామారావు, స్థానిక వైసిపి నాయకులు ఎస్ కరుణాకరరెడ్డి, ఎస్.సరళారాణి, ఎం.భారతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, క్రీడలు మానసికారోగ్యానికి ఎంతో దోహదపడతాయన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలకు సిద్ధం

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురం శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడానికి సర్వం సిద్ధం అయింది. 14వ తేదీ ఉదయం 10 గంటలకు గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తారు. మంగళవారం పుస్తక ప్రదర్శన, బుధవారం విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు, అదేరోజు గ్రంథాలయ ఉద్యమానికి కృషి చేసిన రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య సంస్మరణ సభ, గురువారం విద్యార్థులకు క్విజ్ పోటీలు, కవి సమ్మేళనం, శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, శనివారం మహిళా దినోత్సవం జరుపుతారు. దిశ చట్టం, మహిళా సాధికారత గురించి మల్కాపురం జివిఎంసి హైస్కూల్లో భారీ సభ జరగనుంది. ఆదివారం ముగింపు సమావేశంలో పోటీలలో విజేతలకు బహుమతులు అందజేస్తారు. గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ నిర్వహణలో గ్రంథాలయ కమిటీ సభ్యులు జికెవి.రాజు, కె.సత్తిరాజు, బి.సత్యానందం, ఎస్.చలపతిరావు, ఐపిఎస్.భాగ్యలక్ష్మి తదితరులు చేయూతనందిస్తారు. ఈ సందర్భంగా కార్యక్రమ వివరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నేరాలు ఘోరాలు

కారు ఢీకొని వృద్ధుడు దుర్మరణం

ప్రజాశక్తి- యలమంచిలి రూరల్: మండలంలో పురుషోత్తపురం జాతీయ రహదారి వద్ద కారు ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాలివి. కోటవురట్ల మండలం, గవరపాలెంకి చెందిన వేగి వెంకటరమణమూర్తి(63) టీవీఎస్ స్కూటర్‌పై యలమంచిలి వచ్చి, తిరుగు ప్రయాణంలో స్వగ్రామం గవరపాలెం వెళ్తుండగా పురుషోత్తపురం జంక్షన్ వద్ద వెనకనుంచి ఎపి 39 ఎన్‌డి 1113 గల నిస్సాన్ కారు బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన వెంకటరమణమూర్తినిఅనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో శనివారం మృతి చెందాడు. దీనిపై ఎలమంచిలి రూరల్ ఎస్ఐ కె. సన్ని బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు..

పాముకాటుతో గీత కార్మికుడు మృతి

ప్రజాశక్తి - పరవాడ: మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ మెట్టపాలెనికి చెందినకల్లుగీత కార్మికుడు గండిమాని దేముడు (69) శుక్రవారం సాయంత్రం పాముకాటుతో మృతి చెందారు. కల్లుగీతతో జీవనోపాధి పొందుతున్న దేముడు, ఎప్పటిలాగే శుక్రవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కి కల్లు తీసి, కిందకు దిగగా, అక్కడున్న పాము ఎడమ కాలుపై కాటేయడంతో వెంటనే అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు. అతనిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారని పోలీసులు తెలిపారు. మృతుని అల్లుడు కట్టా సూకరాజు ఫిర్యాదు మేరకు పరవాడ సిఐ పి ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ఆధునికీకరించిన మార్చురీ గది అప్పగింత

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమునిపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో దివీస్ సిఎస్ఆర్ నిధులు రూ.29 లక్షలతో ఆధునికీకరించిన మార్చురీ గదిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.సిద్ధార్థకుమార్‌కు సిఎస్ఆర్ అధికారి నాగరాజు శనివారం అప్పగించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, మార్చురీలో శవ పంచనామా చేసేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని దివీస్ యాజమాన్యం మార్చురీ గదిని ఆధునికీకరించినట్లు వివరించారు. ఒకేసారి నాలుగు మృతదేహాలను భద్ర పరిచేందుకు వీలుగా ఫ్రీజర్ బాక్సులను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివీస్ సిబ్బంది ఎన్.బాలకృష్ణ, కె.నరసింహారావు, వైద్యాధికారి రేఖ, ఎఎన్ఎం రమణమ్మ పాల్గొన్నారు.

పౌర గ్రంథాలయంలో పుస్తక సమీక్షలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రముఖకవి రొక్కం కామేశ్వరరావు మూడుభాషలలో రచించిన మూడు కవితా సంపుటాలను ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎల్ఆర్.స్వామి శనివారం పౌరగ్రంథాలయంలో ఆవిష్కరించారు. విశాఖ సాహితీ మిత్ర ఆధ్వర్యాన ప్రముఖ రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తమిళంలో అనువదింపబడిన అంతర్మగ్నం పుస్తకాన్ని ఎల్ఆర్ స్వామి సమీక్షచేశారు. ఇన్నర్ విజన్ ఆంగ్లానువాదపుస్తకాన్ని డాక్టర్ వి.రాధాదేవి, ముఖారి తెలుగు కవితను ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ సమీక్షించారు. రొక్కం కామేశ్వరరావు ఆయన అనుభవాలను, కవిత్వచైతన్యతత్వాన్నీ సునిశితంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు, అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన రూ.20 వేలు విలువైన కంపాస్ బాక్స్, అట్ట, పెన్ను, ఎరైజర్, స్కేల్ తదితరాలను ఎన్ఎంఎంఎస్ విద్యార్థులు 125 మందుకు శనివారం బ్యాంకు విశాఖ బ్రాంచి ప్రతినిధులు అందజేశారు. చిట్టివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ విశాఖ బ్రాంచి మేనేజర్ బిఎస్‌వి.రమణ, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.రామలింగేశ్వరరావు, సిఎం హెచ్ఆర్ ఎ.బిఆర్.నాయుడు, ఎస్ఐఇఎ జనరల్ సెక్రెటరీ అరవింద్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఇఒ బాలామణి, సొసైటీ వ్యవస్థాపకులు గంటన మోహనరావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పొట్నూరు మురళీ మోహన్‌రావు, రేఖ అప్పారావు, ప్రభుత్వ డైట్ లెక్చరర్ జి.రవి, విశ్రాంత హెచ్ఎం దత్తి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

15న షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఈ నెల 15న రేసపువానిపాలెంలోని సర్వభారతి స్టేడియంలో జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జిఎఫ్ కార్యదర్శి సిహెచ్.వెంకటరెడ్డి తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలకు చెందిన 14, 17 ఏళ్లలోపు కేటగిరీలో ఉన్న వారు అర్హులని తెలిపారు. వివరాలకు 9866401002 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

లోక్ అదాలత్‌లో 18 వేల కేసులు పరిష్కారం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు శ్రీదేవి

ప్రజాశక్తి-లీగల్ విలేకరి : జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్ ద్వారా 18 వేలు కేసులు పరిష్కారమై రూ.20 కోట్లను కక్షిదారుకు అందజేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ అధ్యక్షులు జి.శ్రీదేవి తెలిపారు. విశాఖ జిల్లా కోర్టులోని న్యాయ సేవాసదన్‌లో లోక్ అదాలత్‌ను శనివారం ఆమె ప్రారంభించి ప్రసంగించారు. కేసుల పరిష్కారంలో ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ మూడో స్థానంలో నిలిచిందన్నారు. లోక్ అదాలత్ తీర్పులు శాంతికి సుస్థిరంగా నిలుస్తాయని, కక్షిదారులు బేషజాలకు పోకుండా తమ కేసులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహాయంతో లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా కోర్టు ప్రాంగణాలలో జాతీయలోక్ అదాలత్ అట్టహాసంగా ప్రారంభమై అత్యధిక కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. కక్షిదారులు సమయాన్ని, ధనాన్ని ఆదా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి తిరుమలరావు, బార్ కౌన్సిల్ మెంబర్ బైపా అరుణ్‌కుమార్, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వైద్యుల రవీంద్రబాబు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కెకెవి.బులికృష్ణ పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-సీతమ్మధార : నేషనల్ షటిల్ టోర్నమెంట్ విశాఖలోని స్వర్ణభారతిలో జరుగుటకు సహాయ సహకారాలు అందజేసిన విజయసాయిరెడ్డికి విశాఖ జిల్లా షటిల్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది. ఆయన్ను కార్యవర్గ సభ్యులు కలిసి శాలువా వేసి సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా షటిల్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలు జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షటిల్, బ్యాడ్మింటన్ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు, ఎసిపి చుక్క శ్రీనివాస్, కార్పొరేటర్, అంతర్జాతీయ మాజీ క్రీడాకారిణి ఉషశ్రీ, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎయు శతాబ్ది ఉత్సవాలకు ప్రధానికి ఆహ్వానం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు 2023 ఏప్రిల్‌లో ప్రారంభమవుతాయని, వీటిని ప్రారంభించడానికి రావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాద్‌రెడ్డి ఆహ్వానించారు. ఏయూ మైదానంలో ప్రధాని మోడీని విసి స్వాగతించారు. ఈ సందర్భంగా సర్ సిఆర్.రెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణన్, సివి.రామన్, ఆచార్య సూరి భగవంతం వంటి మహనీయులందరూ ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేసిన విధానాన్ని ప్రధానికి వివరించారు. ప్రధాని చెప్పిన మేకిన్ ఇండియా నినాదాన్ని కార్యరూపంలో చూపే దిశగా ఆంధ్ర విశ్వవిద్యాలయం పనిచేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరుగుతున్న చారిత్రక అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన లేఖను ప్రధానమంత్రికి ప్రసాద్ రెడ్డి అందజేశారు. భారతదేశాన్ని ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే ప్రధానమంత్రి ఆకాంక్షను సాకారం చేసే దిశగా ఎయు పనిచేస్తుందని, దీనికి ప్రధానమంత్రి ఆశీస్సులు కావాలని విసి కోరారు.

టిడ్కో ఇళ్లను జనసేన పరిశీలన

ప్రజాశక్తి- యంత్రాంగం

మధురవాడ : జగనన్న ఇళ్ల పథకం అమలులో జరుగుతున్న అవకతవకలను పరిశీలించేందుకు జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు జనసేన భీమిలి ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల ఆధ్వర్యాన జివిఎంసి 7వ వార్డు పరిధి సుద్దగడ్డ వద్ద నిర్మించిన టిడ్కో గృహాలను జనసేన బృందం శనివారం పరిశీలించింది. ఈ సందర్భంగా సందీప్ పంచకర్ల మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇళ్లు నిర్మించి ఇస్తానని చెప్పి ఇప్పటివరకు పూర్తిచేయలేదన్నారు. ఇప్పటివరకు నిర్మించినవి అందించడంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. మూడు రోజుల కార్యక్రమం అనంతరం పూర్తి నివేదికను పార్టీ అధ్యక్షునికి పంపనున్నట్లు సందీప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బివి.కృష్ణయ్య, శ్రీనుబాబు, నాయుడు, అనురాధ, చిన్న, నాని తదితరులు పాల్గొన్నారు.

సిరిపురం : జగనన్న ఇళ్ల పంపకాల్లో అవకతవకలు జరుగుతున్నాయని తమ పరిశీలనలో తేలిందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ తెలిపారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ అదేశాల మేరకు 'జగనన్న ఇళ్లు - పేదలందరికీ కన్నీళ్లు' కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం పెద్ద వాల్తేర్, జాలారిపేట, ఆదర్శ గ్రామం వద్ద గల జగనన్న ఇళ్లను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శ గ్రామం వద్ద 120 జగనన్న ఇళ్లు నిర్మించారని తెలిపారు. ఇందులో 41 మంది అసలు లబ్ధిదారులుండగా, గతంలో ఇళ్లు పొందిన 72 మందికి మరలా అక్రమ మార్గంలో కేటాయించారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. వీటిపై సోషల్ ఆడిట్ చేయగా ఈ భాగోతం బయటపడిందన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి అర్హులైన లబ్ధిదారులకు జగనన్న ఇళ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాగలక్ష్మి, కళ, భోగిల శ్రీనివాస్, పి.ప్రసాద్, పాల్గొన్నారు.

సభకు రాకుంటే పథకాలు ఆపేస్తాం..!

బెదిరించి ప్రధాని సభకు తరలింపు

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రధాని బహిరంగ సభకు రాష్ట్ర ప్రభుత్వం తరలించిన వారిలో ఎక్కువ శాతం మంది డ్వాక్రా మహిళలే ఉన్నారు. వీరందరూ అభిమానంతోనే వచ్చారా అంటే కాదని చెప్పవచ్చు. సభకు రాకపోతే రుణమాఫీ ఉండదని, పావలా వడ్డీ రద్దు చేస్తామని, గ్రూపులో ఏ ఒక్కరూ రాకపోయినా మొత్తం గ్రూపునే రద్దు చేస్తామని భయపెట్టడంతోనే వారంతా వచ్చినట్లు స్పష్టమైంది. సామాజిక ఫించన్లు రావని భయపెట్టి మరికొంత మందిని.. ఇలా జనాలను సమీకరించినట్లు వచ్చినవారి మాటల్లో స్పష్టమైంది. మోడీ సభకు హాజరైన వారిని 'ప్రజాశక్తి' పలకరించగా పలు అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

జేజేలు కొట్టమన్నారు...

మేము శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల మండలంలోని అంబేద్కర్ యూనివర్సిటీ విద్యార్థులం. మూడు బస్సుల్లో సుమారు 200 మందిని మోడీ సభకు తీసుకొచ్చారు. సభ వద్ద ఫీజు రియంబర్స్‌మెంట్, విదేశీ విద్యా దీవెన-సిఎం జగన్, అందరికీ గూడు-సిఎం జగన్ అనే ప్లకార్డులు పట్టుకొని జేజేలు పలకాలని కాలేజీ యాజమాన్యం పంపిస్తే ఇక్కడకు వచ్చాం



అంబేద్కర్ యూనివర్సిటీ విద్యార్థులు, ఎచ్చర్ల, శ్రీకాకుళం జిల్లా

భయపెట్టి తరలింపు

ములగాడ : ప్రధాని నరేంద్ర మోడీ సభకు డ్వాక్రా మహిళలను అధికార వైసిపి నాయకులు భయపెట్టి తరలించారని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. హాజరు కాకపోతే రాయితీలు, పెన్షన్లు, డ్వాక్రా రుణాలు, పలు పథకాలను రద్దు చేస్తామని, డ్వాక్రా సంఘంలో పేరు తొలగిస్తామని భయపెట్టడంతో పనులు మానుకొని సభకు హాజరు కావాల్సి వచ్చిందని తెలిపారు. ప్రతి ఒక్క రాజకీయ పార్టీకీ ఇదొక అలవాటుగా మారుతుందని కొంతమంది మహిళలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

పెన్షన్ రాదన్నారు...

నాకు 65 ఏళ్లు సరిగా నడవలేను. అయినా తప్పనిసరిగా మోడీ మీటింగుకు రావాలని వాలంటీరు గత కొన్ని రోజులుగా చెబుతూనే ఉన్నారు. సభకు రాకపోతే వృద్ధాప్య పెన్షన్ ఆగిపోతుందని భయపెట్టారు. ఓపిక లేక ఇక్కడ కూర్చుండిపోయాను.



అప్పలనర్సమ్మ, వృద్ధాప్య పెన్షన్ లబ్ధిదారు, విశాఖ హార్బరు.

డ్వాక్రాలో పేర్లు తొలగిస్తారని..

ప్రధాని మోడీ సభకు తప్పనిసరిగా రావాలి. లేకుంటే డ్వాక్రా గ్రూపులో పేరు తొలగిస్తాం. మీరు తీసుకున్న అప్పుకు రుణ మాఫీ వర్తించదు. ఆర్‌పి ఒత్తిడి చేసి తీసుకొచ్చారు.



లక్ష్మి, డ్వాక్రా మహిళ, అప్పుఘర్

వాలంటీరు తీసుకొచ్చారు

మా ఏరియా వాలంటీరు గత కొన్ని రోజులుగా ఇంటికి వచ్చి మీటింగు ఉందని ఇక్కడకు తీసుకొచ్చారు. రాకపోతే పెన్షన్లు ఆగిపోతాయని చెప్పారు. అది ఏ మీటింగో కూడా నాకు తెలియదు. నడవలేక ఆగిపోయాను.



కె.రాములమ్మ, వృద్ధాప్య పెన్షన్ లబ్ధిదారు, పోస్టాఫీసు ఏరియా

అరెస్టులు, గృహ నిర్బంధాలు దారుణం

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రధానమంత్రి నరేంద్రమోడీ విశాఖ పర్యటన సందర్భంగా కార్మిక నాయకుల అరెస్టులు, గృహ నిర్బంధాలను పలువురు తీవ్రంగా ఖండించారు.

ములగాడ : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని, రాష్ట్ర విభజన సందర్భంగా చట్టంలో పొందుపరిచిన అంశాలను అమలు చేయాలని ప్రధానమంత్రిచే ప్రకటన చేయించాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులను అరెస్టులు చేయడం తగదని విశాఖ డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ప్రతినిధి పి.గోపాలకృష్ణ పేర్కొన్నారు. రక్షణరంగంలో కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, ఆఫ్ లోడింగ్ రద్దు, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మికులకు అనుకూలంగా వచ్చిన తీర్పులను తక్షణమే అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని, ప్రభుత్వ, రక్షణ రంగ పరిశ్రమలను ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించి ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ విశాఖ డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు ప్రధానమంత్రికి బహిరంగ లేఖ రాశారని తెలిపారు. రెడ్డి వెంకటరావుపై తప్పుడు రిపోర్ట్ తయారుచేసి అరెస్టుకు సిద్ధమయ్యారని, దానిని తిరస్కరించిన ఆయన్ని గృహ నిర్బంధం చేశారని పేర్కొన్నారు. సిఐటియు నాయకులను, స్టీల్ ప్లాంట్, ఇతర పరిశ్రమల నాయకులను ఆక్రమంగా అరెస్టులు చేసి జిల్లాలోని ఇతర పోలీస్ స్టేషన్లకు తరలించడం తగదన్నారు. హామీలు అమలుచేయని మోడీకి రాష్ట్ర ప్రభుత్వం ఘనస్వాగతం పలుకుతూ లక్షలాదిమందిని తరలించి ప్రధానమంత్రి ముందు మోకరిల్లిందని విమర్శించారు.

సీతమ్మధార : స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, ప్రధాని మోడీ గో బ్యాక్ అంటూ కృష్ణ కాలేజీ నుంచి మద్దిలపాలెం వరకు ఊరేగింపుగా వెళ్తున్న ఉద్యమకారుల అక్రమ అరెస్టులను ఎఐటియుసి నాయకులు పడాల రమణ, జి.వామనమూర్తి తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అమ్మకానికి పెట్టిన నరేంద్ర మోడీకి మాట్లాడే అర్హత లేదన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యమాన్ని ఆపేది లేదు

ప్రజాశక్తి-పెందుర్తి : స్టీల్‌ప్లాంట్ ఉద్యమం కొనసాగుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ జె.అయోధ్యరామ్ తెలిపారు. మోడీ పర్యటనను పురస్కరించుకొని శుక్రవారం 45 మంది స్టీల్‌ప్లాంట్ కార్మికులను, నాయకులను అరెస్టు చేసి పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శనివారం మధ్యాహ్నం వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోడీ వచ్చారు.. శంకుస్థాపన చేశారు.. తప్ప స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వం రంగ సంస్థలు, ప్రత్యేక హోదా, పోలవరం తదితరాలపై మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పిన సమస్యలను మోడీ వినీవిన్నట్లు వ్యవహరించారని విమర్శించారు. స్టీల్ ప్లాంట్‌పై పోరాటం జరుగుతున్నా మోడీ స్పందించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆయన పర్యటనకు వస్తారని తమను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రానున్న రోజులో ఉద్యమం మరింత ఉధృతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, శ్రీనివాసరాజు, గంగాధర్, నరేంద్ర, ఆనంద్, గంధం వెంకటరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌నుంచి విడుదలై మాట్లాడుతున్న అయోధ్యరామ్



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

'ఉక్కు' ప్రయివేటీకరణ ఆపాలని నిరసన

ప్రజాశక్తి-కంచరపాలెం : స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయబోమని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రధానమంత్రి మోడీ విశాఖలో ప్రకటించాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి 52వ వార్డు పరిధి ఎన్ఎడిలో సిఐటియు ఆధ్వర్యాన శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఒ.అప్పారావు మాట్లాడుతూ, విశాఖకు గుండెకాయ లాంటి స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తామనడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం పోరాడుతున్న వారిని జగన్ ప్రభుత్వం అరెస్టులు చేయడం అన్యాయం అన్నారు. ప్రధానితో ప్రకటన చేయించాల్సిన ముఖ్యమంత్రి ఆ పని చేయకపోగా శాంతియుతంగా పోరాడేవారిని అరెస్టులు చేయడం మోడీకి లొంగిపోవడమేనని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ ప్రధానిని కలిసి స్టీల్‌ప్లాంట్ కోసం మోడీపై ఒత్తిడి తీసుకురాలేదని, ప్రజలకు ఆయన సందేశం ఇచ్చినట్లని ప్రశ్నించారు. ఇప్పటికైనా జగన్, పవన్, చంద్రబాబులు తమ స్వార్థపు రాజకీయాలు విడనాడి విశాఖకు వెన్నెముక లాంటి స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ కాకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మహేశ్వరి, అప్పలరాజు, బాబూరావు, నర్సియమ్మ తదితరులు పాల్గొన్నారు.

మోడీ పర్యటనపై నిరసనల వెల్లువ



రాంబిల్లిలో ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

ప్రధాని మోడీ విశాఖ పర్యటనను నిరసిస్తూ శనివారం రెండవ రోజున కూడా పలుచోట్ల నిరసనలు వెల్లువెత్తాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌తోపాటు పలు ప్రభుత్వరంగసంస్థలనుప్రైవేటీకరించడంతోపాటు ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ నిధులు వంటి విభజన హామీల అమలులో మొండిచేయి చూపిన ప్రధాని ఏ మొహం పెట్టుకుని వచ్చారని ప్రశ్నిస్తూ, 'మోడీ గోబ్యాక్' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. మోడీ చేస్తున్న శంకుస్థాపనలన్నీ అమరావతి అభివృద్ధిలా అర్థాంతరంగా మిగిలిపోతాయని ఎద్దేవా చేశారు.

\- ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం

రాంబిల్లి : మోడీ విశాఖ పర్యటనను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ, విభజన ఆంధ్రకు ప్రత్యేకహోదా, అమరావతి రాజధాని, పోలవరం నిర్మాణానికి నిధులు, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేకప్యాకేజీ, విశాఖ రైల్వేజోన్ ఇలా ఇచ్చినహామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయని ప్రధాని మోడీ ఏం మొహం పెట్టుకుని ఆంధ్రాపర్యటనకు వచ్చారో చెప్పాలని మండిపడ్డారు. రాష్ట్రవిభజనతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన ఆంధ్రాను ఆదుకోవాల్సిందిపోయి, ఆంధ్రుల హక్కుగా ఉన్న విశాఖ ఉక్కును ప్రైవేటుకు అమ్మేయాలని నిర్ణయించిన మోడీ, ఎపికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఆంధ్రాకు కేంద్రం ఇంతగా అన్యాయం చేస్తున్నా, రాష్ట్రంలోని అధికార వైసిపితోపాటు ప్రధాన ప్రతిపక్షం టిడిపి, మిత్రపక్షం జనసేన నోరు మెదపకపోగా, రెడ్‌కార్పెట్ స్వాగతం పలకడం రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి దేముడు నాయుడు, సిహెచ్ గంగరాజు, సిహెచ్ పవన్‌కుమార్, బద్ది భాస్కరరావు, బంగారురాజు, నూకరత్నం, లక్ష్మి పాల్గొన్నారు.

కె.కోటపాడు : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తూ, విభజన హామీలకు ఎగనామం పెట్టిన ప్రధానిమోడీ విశాఖ పర్యటనకు రావడం సిగ్గుచేటని సిపిఎం నేతలు మండిపడ్డారు. మండలంలోని సూరెడ్డిపాలెం మెయిన్‌రోడ్డులో మోడీ రాకను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. సిపిఎం నేతలు ఎర్ర దేవుడు, వనం సూర్యనారాయణ మాట్లాడుతూ, మోడీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ప్రతీ చర్య వల్ల ఎపికి అన్యాయం, నష్టం జరిగిందే తప్ప, ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. అమరావతి రాజధానికి శంకుస్థాపన చేసిన మోడీ దాన్ని పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలేశారని, ఇపుడు విశాఖకు వచ్చి ఏం ఒరగబెడతారని ప్రశ్నించారు. వెలగల వెంకటరావు, కర్రి జానకిరామ్, పోతల శ్రీరామ్ పాల్గొన్నారు.



కె.కోటపాడు సూరెడ్డిపాలెంలో సిపిఎం నేతల నిరసన



అనకాపల్లిలో ఎఐటియుసి ఆధ్వర్యాన నిరసన

అనకాపల్లి : విభజన హామీలను అటకెక్కించిన ప్రధాని మోడీ ఐదు కోట్ల ఆంధ్రులను మోసగించారని, దీనిపై ప్రశ్నించాలని ప్రయత్నిస్తే నిర్బంధాలు, అక్రమ అరెస్టులతో అడ్డుకోవడం దుర్మార్గమని ఎఐటియుసి జిల్లా కన్వీనర్ వైఎన్.భద్రం, రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ, శ్రీరామదాసు అబ్బులు మండిపడ్డారు. మోడీ ప్రభుత్వ విధానాలు, ప్రధాని పర్యటన సందర్భంగా వామపక్షనేతల అక్రమ అరెస్టులను ఖండిస్తూ నిరసన ఎఐటియుసి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

ఎనిమిదేళ్ల మోడీ పాలనలో కార్పొరేట్లకు రూ.పదిలక్షల కోట్ల రాయితీలిచ్చి, సామాన్య ప్రజలపై పెట్రో ఉత్పత్తులు, వంటగ్యాస్, నిత్యావసరాల ధరల మోతతో కుదేలు చేశారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో వీరాచారి, కెవి రమణ, శ్రీకాంత్, జానీ, అప్పారావు, సత్యారావు, చెల్లూరి నాగరాజు, కోరిబిల్లి శంకర్రావు, ఆడారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ ప్రయాణికులు అక్కడే..!

- ప్రధాని సభకు తరలిన మెజార్టీ ఆర్‌టిసి బస్సులు
- గంటల తరబడి రోడ్లపై, బస్‌స్టేషన్లలో జనంపడిగాపులు
- మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లో మరీ దారుణం
- అదును చూసి ఆటోలు, ప్రైవేటు వాహనదారుల దోపిడీ



విశాఖ ద్వారకాబస్‌స్టేషన్‌లో వేచి చూస్తున్న ప్రయాణికులు

విశాఖ ఎయు గ్రౌండ్‌లో ప్రధాని మోడీ సభకు ఉమ్మడి విశాఖ జిల్లాల్లోని ఆర్‌టిసి డిపోల నుంచి మెజార్టీ బస్సులను జనసమీకరణకు తరలించడంతో, రాకపోకలకు ప్రజలు నానా ఇక్కట్లు పడ్డారు. గ్రామీణ ప్రాంతంలో అనేక రూట్లలో బస్సులు పూర్తిగా నిలిచిపోగా, రద్దీ ఉన్న రూట్లలో కొద్దిబస్సులే తిరగడంతో గమ్యస్థానాలు చేరుకోవడానికి ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. ఇదే అదనుగా ఆటోవాలాలు, ప్రయివేటు వాహనదారులు రెట్టింపు మించి ఛార్జీలను వసూలు చేసి ప్రజల జేబులకు చిల్లుపెట్టారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

అనకాపల్లి : విశాఖపట్నంలో ప్రధాని మోడీ బహిరంగ సభకు అనకాపల్లి, నర్సీపట్నం డిపోల పరిధిలోని200బస్సులకు గాను 150 బస్సులను తరలించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మిగిలిన పావు వంతు బస్సులను నర్సీపట్నం, విజయనగరం, చోడవరం తదితర ప్రాంతాలకు తిప్పడంతో మిగిలిన రూట్లలో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. కొన్నిరూట్లలో నాలుగైదు గంటలకుగానీ ఒక బస్సు రాకపోవడంతో ఉదయం నుంచి పిల్లా పాపలతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఏ బస్సు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితితో ఎంక్వైరీ కౌంటర్ వద్ద సిబ్బందితో ప్రయాణికులు వాగ్వాదానికి దిగారు. దీంతో ప్రజలు గమ్యస్థానాలను చేరుకునేందుకు తప్పనిసరిగా ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించగా, ఇదే అదనుగా వారు చేతివాటం చూపించారు. ఎపుడూ వసూలు చేసే ఛార్జీల కంటే మూడు,నాలుగు రెట్లు అధికంగా ప్రయాణికుల నుంచి వసూలు చేశారు.

గాజువాక : గాజువాక, విశాఖ స్టీల్‌సిటీ డిపో నుంచి అనేక బస్సులను మోడీ సభకు తరలించడంతో కనీసస్థాయిలో సిటీ బస్సులు లేక ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. గాజువాక 38 బస్టాప్, శ్రీనగర్, కొత్త గాజువాక, నాతయ్యపాలెం బస్‌స్టాపుల వద్ద ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు పడ్డారు. చివరకు అధిక ఛార్జీలు చెల్లించి ఆటోలను ఆశ్రయించి వెళ్లాల్సి వచ్చింది. గాజువాక, గోపాలపట్నం వరకు రెగ్యులర్‌గా ఆటోలున్నా, అటుగా పెందుర్తి, కొత్తవలస, సింహాచలం వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం డిపోలో 100 బస్సులకు గాను 76 బస్సులు విశాఖపట్నం సభకు తరలించారు. నర్సీపట్నం ప్రాంతం నుండి తుని వెళ్లే అన్ని బస్సులు రద్దయ్యాయి. దీంతో రైల్వే స్టేషన్‌కు వెళ్లాల్సిన ప్రయాణికులు అవస్థలు పడ్డారు. చోడవరం, అనకాపల్లి బస్సులు రద్దయ్యాయి. ఏజెన్సీ ప్రాంతమైన చింతపల్లి ఒక బస్సు తిరుగుతుండగా కేడీపేట, కొయ్యూరు వైపు ఒక బస్సే తిరిగింది. దీంతో, ప్రయాణికులు అనేక ఇక్కట్లు పడ్డారు. తగ్గించడంతో బస్సుల్లో సీటు మాత్రం దేవుడెరుగు, కనీసం వేలాడైనా గమ్యాలను చేరుకునేందుకు ప్రయాణికులు ఎగబడ్డారు. ఆర్‌టిసి బస్‌స్టేషన్‌లో పిల్లాపాపలతో గంటల తరబడి పడిగాపులు పడి, చివరకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి వెళ్లారు.

తగరపువలస : ప్రధాని సభకు భారీగా బస్సులు తరలిన నేపథ్యంలో విశాఖ, మద్దిలపాలెం తదితర డిపోల ఆర్‌టిసి బస్సులు తగరపువలస రాకపోవడంతో నిత్యం రాకపోకలు సాగించే ఉద్యోగులు, విద్యార్థులు, ఉపాధికోసం వచ్చే వందలాది మంది అవస్థలు పడ్డారు. బస్‌పాసులన్నా అధిక మొత్తంలో ఛార్జీలను చెల్లించి అవస్థలు పడ్డారు.

సింహాచలం: ప్రధాన మోడీ బహిరంగ సభకు ఆర్టీసీ బస్సులు వెళ్లిపోవడంతో సింహగిరిపై అప్పన్న దర్శనానికి వచ్చిన భక్తులు పడిగాపులు పడ్డారు. దేవస్థానం బస్సులు పరిమిత సంఖ్యలో ఉండడంతో కొండెక్కి దిగడానికి గంటల తరబడి క్యూలైన్లలో వేచిఉండక తప్పలేదు.

పాడేరు డిపో నుంచి 30 బస్సులు మళ్లింపు

పాడేరు.: అల్లూరి జిల్లాలో ఏకైక ఆర్‌టిసి బస్సు డిపో పాడేరు నుంచి 30బస్సులను విశాఖలోని ప్రధాని మోడీ సభకు మళ్లించడంతో దాదాపు 90శాతం సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో మన్యవాసులు గంటలకొద్దీ బస్సుల రాక కోసం పడిగాపులు పడుతూనానా అవస్థలు పడ్డారు. పాడేరు నుంచి చింతపల్లి జోలాపుట్టు, అరకు, డొంకరాయి, రాజమండ్రి, కాకినాడ, చోడవరం ప్రాంతాలకు ఒక్కో బస్‌సర్వీసు మాత్రమే నడిచింది. నిత్యం రద్దీగా ఉండే విశాఖపట్నం పాడేరు బస్ సర్వీసులు కూడా బాగా తగ్గించి, కేవలం రెండు బస్సులే తిప్పారు. దూర ప్రాంతాలకు బస్సులు తిరగకపోవడంతో ప్రయాణికులు పాడేరు బస్ కాంప్లెక్స్‌లోనే గంటల కొద్ది పడిగాపులు పడ్డారు. అరకు, చింతపల్లి, చోడవరం, పెదబయలు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి, అధిక ఛార్జీలను చెల్లించి గమ్యాలను చేరుకున్నారు. ఇక జోలాపుట్, మంప, జీకే వీధి, గోమంగి తదితర దూరప్రాంతాలకు వెళ్లే బస్సులు పూర్తిగా లేకపోవడంతో ప్రయాణికులు పాడేరు బస్‌కాంప్లెక్స్‌లోనే నిరీక్షించారు.మోడీ పర్యటనకు బస్సులన్నీ తరలించి, అవస్థలు పాల్జేసిన ప్రభుత్వం, ఆర్‌టిసి యంత్రాంగంపై ప్రయాణికులు నిరసన వ్యక్తం చేశారు.



నర్సీపట్నంలో బస్సులు లేక ఖాళీగా ఉన్న బస్‌కాంప్లెక్స్

నాలుగు గంటలైనా బస్సు లేదు..



బంధువుల ఇంటికొచ్చి తిరిగి నర్సీపట్నం వెళ్లేందుకు ఉదయం నుంచి కాంప్లెక్స్ వద్ద పడిగాపులు పడ్డాం. నాలుగైదు గంటలైనా బస్సు రాలేదు. ఆటో కోసం వెళితే, మూడు నాలుగు రెట్లు ఎక్కువ ఛార్జీ వసూలు చేస్తున్నారు. గత్యంతరం లేక చెల్లించి వెళుతున్నాం.

\- కళావతి, ప్రయాణికురాలు, నర్సీపట్నం



అనకాపల్లిలో ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రజలు

పిల్లలతో ప్రయాణం కష్టం

రాజమండ్రి వెళ్దామని నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వస్తే బస్సులు లేవు. దీంతో తుని వెళ్లి అక్కడ నుండి రైలు లేదా బస్సులు కోసం చూడాలి. పిల్లలతో బస్సులు మారి వెళ్లడం కష్టమే. అయినా తప్పదు.

\-వియ్యపు లక్ష్మి, పోలవరం



పాడేరులో బస్సుల కోసం గిరిజనుల పడిగాపులు

ఉన్న బస్సులన్నీ రద్దుచేశారు



పల్లె వెలుగు బస్సుల్లో రోజూ రాజాం నుంచి వచ్చి వెళుతుంటాం. ప్రధాని సభకు బస్సులు తరలించడంతో రాజాం రూటులో బస్సులన్నీ లేకుండా చేశారు. గంటల తరబడి వేచిచూసి, చివరకు వేరే మార్గంలో అధిక ఛార్జీలు చెల్లించి సొంతూరు వెళుతున్నాం.

\- సత్తిబాబు, ప్రయాణికుడు, రాజాం.

దొడ్డిదారిన బదిలీలు తగవు

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- చోడవరం : నిబంధనలకు విరుద్ధంగా దొడ్డిదారిన బదిలీలకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, ఇది కౌన్సిలింగ్ ప్రక్రియను తుంగలో తొక్కడమేనని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు ఆరోపించారు. పర్యటనలో భాగంగా శనివారం చోడవరంలో విలేకరులతో మాట్లాడుతూ సాధారణ బదిలీలు జరుగుతాయని ఉపాధ్యాయులు ఆశిస్తున్న తరుణంలో, ప్రభుత్వం ఇలా అక్రమ బదిలీలు చేస్తోందన్న వార్తలతో ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన చెందుతున్నారన్నారు. జిల్లాల విభజన నేపథ్యంలో తమ సొంత జిల్లాలకు వెళ్లాలనుకునే వారికి తీవ్ర నిరాశకు గురిచేసే చర్యలకు ప్రభుత్వం పూనుకోవడం సరికాదన్నారు. ప్రజాప్రతినిధుల సిఫార్సులతో బదిలీలు చేపడితే, సీనియర్ టీచర్లు, న్యాయంగా బదిలీ కావాల్సిన వారు, మారుమూల ప్రాంతాల్లోని వారు, ఎటువంటి సిఫార్సుల్లేని ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ప్రస్తుతమున్న కౌన్సిలింగ్ విధానానికి వ్యతిరేకంగా, బదిలీల్లో సిఫార్సులకే ప్రాధాన్యత ఉంటుందన్న వార్తలపై నిజానిజాలు ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కౌన్సిలింగ్‌తో సంబంధం చేపట్టాలనుకునే బదిలీల ప్రక్రియను ఆపాలని కోరారు బదిలీలు, ఉద్యోగోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అక్రమమార్గంలో బదిలీ ప్రక్రియ చేపట్టాలనుకుంటే, రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు ఉద్యమిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్, అల్లూరి జిల్లా అధ్యక్షులు వై. విల్సన్‌బాబు, విశాఖ జిల్లా కోశాధికారి టిఆర్.అంబేద్కర్, చోడవరం మండల అధ్యక్షులు కె.కామరాజు, సీనియర్ నాయకులు డి. శ్రీనివాసు, ఎస్.జగ్గారావు, వి.సూర్యప్రకాష్, ఎస్.రాంబాబు, అప్పలమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

రాష్ట్రస్థాయి యోగా పోటీలు ప్రారంభం


యోగా చేస్తున్న క్రీడాకారులు

ప్రజాశక్తి- చోడవరం : స్థానిక ఉషోదయ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి యోగాసన ఛాంపియన్ షిప్-2022 పోటీలను శనివారం మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీల్లో 19 జిల్లాల నుంచి 300 మంది పాల్గొంటారనిపతంజలి యోగా శిక్షణ కేంద్రం వ్యవస్థాపకులు పులేటి సతీష్ తెలిపారు. డాక్టర్ బంగరు కృష్ణ అధ్యక్షతన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ, చోడవరం పతంజలి యోగా శిక్షణ కేంద్రానికి ఉచితంగా తన సొంత స్థలంను ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

భవనం నిర్మాణానికి సహకరిస్తానని గోవాడ చక్కెర కర్మాగారం మాజీ ఛైర్మన్ గూనూరు మల్లునాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ యోగా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి మణాల్ చక్రవర్తి, అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ పురోహిత్, రాష్ట్ర యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కూన కృష్ణ దేవరాయలు, ప్రధాన కార్యదర్శి అల్లాడి రవికుమార్, ఛైర్మన్ పి నాగేశ్వరరావు, డా.బండారు సత్యనారాయణ, గూనూరు సత్యవతి, కేంద్ర ఛైర్మన్ పి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 75 శాతం రాయితీతో ప్రోత్సాహం


పంటలను పరిశీలిస్తున్న జిల్లా హార్టీకల్చర్ ఆఫీసర్ ప్రభాకరరావు

ప్రజాశక్తి- కె.కోటపాడు : నూతనంగా ఏర్పాటుచేసే రైతు ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘాలకు ప్రభుత్వపరంగా రాయితీతో కూడిన ప్రోత్సాహకాలు అందిస్తామని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి. ప్రభాకరరావు అన్నారు. శనివారం మండలంలోని ఏ కోడూరు గ్రామంలో ఒక రైతు పండించిన ఫ్యాషన్ ఫ్రూట్స్ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రేడింగ్, ప్యాకింగ్, కలెక్షన్ సెంటర్లకు 75శాతం రాయితీతో ప్రభుత్వం రూ.15 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. ప్రతిగ్రామంలోనూ కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. వారాడలో భార్గవ కలెక్షన్ సెంటర్‌ను పరిశీలించారు. ఆర్లి, కింతాడ, కె.సంతపాలెం. గ్రామాలలో రైతు భరోసా కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు.ఉద్యానవన శాఖాధికారి కిరణ్మయి, హార్టీకల్చర్ అసిస్టెంట్ సేవిత, సౌజన్య శిల్ప పాల్గొన్నారు.

వెంకన్న దేవస్థానం ఇఒగా శర్మ


ఇఒ టివిఎస్.శర్మ

ప్రజాశక్తి- వడ్డాది : వడ్డాది వెంకటేశ్వరస్వామి దేవస్థానం కార్య నిర్వహణాధికారిగా టివిఎస్ శర్మ శనివారం ఉద్యోగబాధ్యతలు స్వీకరించారు నర్సీపట్నం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇఒగా పనిచేసిన కె.ఆదినారాయణను అనకాపల్లి బదిలీ చేశారు. ఇఒ శర్మకు వడ్డాదితోపాటు చీడికాడ మండలంలోని అన్ని దేవాలయాల నిర్వహణ బాధ్య తలను అప్పగించారు

సమాచారం లేకుండా ఆక్రమణల తొలగింపు


చెట్లు తొలగిస్తున్న పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆరేడు దశాబ్దాలుగా తాము వేసుకున్న పశువుల పాకలను కనీసం సమాచారం లేకుండా పంచాయతీ అధికారులు తొలగించడంతో రైతులు లబోదిబోమంటున్నారు. తుమ్మపాల మెయిన్ రోడ్‌లో చెరువును ఆనుకొని సుమారు 25 కుటుంబాలు పాకలు వేసుకుని పాడిపశు వులతో జీవిస్తున్నారు. రైతు భరోసా కేంద్రం, లైబ్రరీ ఏర్పాటుకు స్థలం కోసం అందులో ఒకరిద్దరి స్థలాన్ని శనివారం అధికారులు ఖాళీ చేయించారు. అయితే గ్రామంలో పంచాయతీకి చెందిన భూమి ఉండగా, తమ అధీనంలో ఉన్న భూమిని ప్రభుత్వం అధికారులు ఖాళీ చేయించడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు వివరణ కోరగా ఆర్‌డిఒ ఆదేశాలతోనే ఈ స్థలంలో రైతు భరోసా కేంద్రం, లైబ్రరీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. భూమి కోల్పోయిన వారికి నివాస స్థలాన్ని కేటాయిస్తామన్నారు.

వైసిపి పాలనలో మైనార్టీలకు అన్యాయం

ప్రజాశక్తి.-అనకాపల్లి : ముస్లిం మైనారిటీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యతిరేక విధానాలను, అరాచకాలను ప్రశ్నించిన టిడిపి, రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహ్మద్ అరెస్టు చేసి ముఖ్యమంత్రి జగన్ రెడ్డి మైనారిటీల ద్రోహిగా మిగిలిపోయారని టిడిపి మైనారిటీ సెల్ అధ్యక్షులు జిల్లా షేక్ బాబర్ విమర్శించారు. శనివారం స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, టిడిపి ఐదేళ్ల పాలనలో మైనారిటీల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేసిందన్నారు. నవరత్నాల పథకాలను సైతం మైనారిటీ బడ్జెట్లో లెక్కించి జగన్ రెడ్డి ప్రభుత్వం మైనారిటీలను మోసగిస్తోందన్నారు.

మైనారిటీలకు ఇస్లామిక్ బ్యాంకు, దుల్హన్ పథకానికి రూ.లక్ష ప్రోత్సాహం హామీలు జగన్ రెడ్డి కొండెక్కించారన్నారు. మైనారిటీల సంక్షేమ నిధులు రూ.1483 కోట్లు దారి మళ్ళించి మైనారిటీల స్వయంఉపాధి యూనిట్లకు మొండి చేయి చూపిందన్నారు. వక్ఫ్ బోర్డు భూములు అన్యాక్రాంత మౌతున్నా పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో అనకాపల్లి నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ ఖాదర్, కార్యవర్గ సభ్యులు షరీఫ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ బాబర్

వైభవంగా లక్ష్మీగణపతి హోమం


హోమం నిర్వహిస్తున్న ఎంవిఆర్ దంపతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ వ్యాపారవేత్త, ఎంవిఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు, సూర్యకుమారి దంపతులు శనివారం నరసింగరావుపేట తన స్వగృహంలో శ్రీలక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. 108 రోజుల వెంకటేశ్వర స్వామి దీక్షను తీసుకున్న నేపథ్యంలో వేద పండితులు శ్రీనివాసరావు మళ్లీబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. వచ్చేనెల 17న వెంకటేశ్వర స్వామి కళ్యాణం, చతుర్వేద పారాయణ శాస్త్ర కమలార్చనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంవిఆర్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ డైరెక్టర్ ముత్యాల రాజేష్, ముత్యాల గార్మెంట్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ముత్యాల సతీష్, ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్: ఈనెల 14 నుంచి 20వరకు స్థానిక శాఖాగ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ ఎల్‌వి రమణ తెలిపారు. 14న బాలల దినోత్సవంతో వారోత్సవాలు ప్రారంభమై, 15నచిత్రలేఖనం, 16నవ్యాసరచన, 17న దేశభక్తి గేయాలాపన, చిత్రలేఖనం, 18న మొబైల్ ఫోన్ల వినియోగంతో ప్రయోజనాలు, అనర్థాలుపై వక్తృత్వ పోటీలు,, 19న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా సాధికారతలో ప్రభుత్వాల పాత్ర, 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన పోటీలు నిర్వహించి, ముగింపు రోజున బహుమతులు అందజేస్తామన్నారు.

సబ్బవరం: స్థానిక శాఖాగ్రంథాలయంలో 55 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల14 నుంచి నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి పివి. రమణ తెలిపారు. 14న గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం, చాచా నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, సభ్యత్వ ధరావత్తు సేకరణ,16న చిత్రలేఖనం,17న వ్యాసరచన,18న క్విజ్,19న మహిళా దినోత్సవం, ఇందిరాగాంధీ జయంతి రోజున ముగ్గులు పోటీలు, 20 వారోత్సవాలు ముగింపు, బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.

కశింకోట: మండలంలోని తాళ్ళపాలెం గ్రంథాలయంలో ఈనెల 14 నుండి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు శాఖ గ్రంథాలయం అధికారి కాండ్రేగుల జగన్నాథం తెలిపారు 14న గ్రంథాలయం వారోత్సవాలు ప్రారంభమై, 15న పుస్తక ప్రదర్శన, సభ్యత్వ డిపాజిట్లు సేకరణ, మ్యూజికల్ ఛైర్ పోటీలు,16న పద్యాలు, చిత్ర లేఖనం, 17 న వ్యాసరచన పోటీలు, 18న చదరంగం, క్విజ్ పోటీలు, 19 న మ్యూజిక్ ఛైర్ పోటీలు,20 న ముగింపు బహుమతులు ప్రదానం ఉంటుందని తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల జయప్రదానికి గ్రామస్తులు, విద్యార్థులు సహకారం అందించాలని జగన్నాథం కోరారు.

నేడు ఎండపల్లిపాలెంలో 'గడపగడపకూ..'

ప్రజాశక్తి -దేవరాపల్లి : కెఎం.పాలెం పంచాయతీ యండపల్లిపాలెం గ్రామంలో ముషిడిపల్లి సచివాలయం పరిధిలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైసిపి మండల అధ్యక్షుడు బూరె బాబురావు తెలిపారు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, ఈర్లే అనురాధ, ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు, కర్రి సత్యం పాల్గొంటారని తెలిపారు.

వెల్లూరుకు అయ్యప్ప భక్తుల సైకిల్ యాత్ర

ప్రజాశక్తి -అచ్యుతాపురం : తిమ్మరాజుపేట నుంచి శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు సైకిలుయాత్ర శనివారం ఎనిమిదో రోజుకు తమిళనాడు రాష్ట్రంలో వెల్లూరు ప్రాంతానికి చేరుకుంది.. సైకిల్ యాత్రలో కర్రి ఆదిబాబు, పి శ్యామ్ కుమార్, పూడి గోవింద, కారు కనకరాజు ఉన్నారు. తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన భీశెట్టి గంగాధర్ ఆధ్వర్యంలో మరో 10 మంది అయ్యప్ప స్వాములు ఆంధ్రాలో సైకిలుయాత్ర కొనసాగిస్తున్నారు.

వినియోగదారుల హక్కుల నేత, న్యాయవాది శివయ్య కన్నుమూత


న్యాయవాది శివయ్య (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తిది -అనకాపల్లి : కన్స్యూమర్స్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు, సీనియర్ న్యాయవాది సి. శివయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. అనంతపురం జిల్లాకు చెందిన శివయ్య, అనకాపల్లిలో న్యాయవాదిగా స్థిరపడ్డారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో వినియోగదారుల రక్షణ చట్టానికి విస్తృత ప్రచారం, ఉద్యమ వ్యాప్తికి శ్రీకారం చుట్టిన మొట్టమొదటి వ్యక్తి శివయ్య. న్యాయవాదిగా, జర్నలిస్టుగా, రచయితగా, కమ్యూనిస్టువాదిగా, అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా సేవలందించారు. బడుగు బలహీన వర్గాల వారికి ఉచిత న్యాయసేవలు అందించారు. ఎఐవైఎఫ్, ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కోపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, ఇంకా పలు ప్రజాసంఘాలకు అధ్యక్షునిగా వ్యవహరించారు. శివయ్య మృతి పట్ల సిపిఐ శ్రేణులు సంతాపం ప్రకటించి, అనకాపల్లి బార్ అసోసియేషన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మరోసారి రాష్ట్రానికి మోసం

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అప్పలరాజు

ప్రజాశక్తి-నక్కపల్లి: విశాఖపట్నంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలను మోసం చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు తెలిపారు. విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా లక్షల మంది ప్రజలను సమీకరించి సభ జరిపారని, ఈ సభలో నరేంద్ర మోడీ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ నిలుపుదల, ప్రత్యేక హోదా, రైల్వే జోన్, విభజన చట్టంలో హామీలు, పోలవరం ప్రాజెక్టు, ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిధులు కేటాయింపులు చేస్తారని ఆశించామని, వీటిపై రాష్ట్ర ముఖ్యమంత్రి పేలవంగా ప్రస్తావించారన్నారు. వీటిపై ప్రధాన మంత్రి ఏమీ మాట్లాడకుండా గతంలో ప్రకటించిన పాత



మాట్లాడుతున్న అప్పలరాజు

ప్రాజెక్టులకు శంఖుస్థాపన చేశారని విమర్శించారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని లక్షలాది మంది ప్రజల సమక్షంలో ముఖ్యమంత్రి ప్రధాన మంత్రికి ఎందుకు దాసోహం చేశారో, ఈ సభ ద్వారా రాష్ట్రానికి ఏం సాధించారో సమాధానం చెప్పాలన్నారు. 10 వేల కోట్ల విలువ చేసే ప్రాజెక్టులు సాధించి 3 లక్షల 30 వేలు కోట్ల విలువ చేసే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడకపోవడమా సాధించిన ఘనత అని ప్రశ్నించారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు రాష్ట్ర ప్రయోజనాల పట్ల చిత్తశుద్ధి ఉంటే ప్రత్యేక హోదా, స్టీల్ ప్లాంట్‌పై ఏందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, నేతలు రాయుడు, కనకారావు, రమణ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మత్స్యకారులు


348వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి -నక్కపల్లి: హెటిరో పైప్‌లైన్ పూర్తిగా తొలగించాలని మత్స్యకార యువత డిమాండ్ చేశారు. మత్స్యకార జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన శాంతియుత మహా ధర్నా శనివారం నాటికి 348వ రోజుకు చేరింది. పైపులైన్‌కు వ్యతిరేకంగా శిబిరం వద్ద మత్స్యకార యువత పెద్దపెట్టున నినాదాలు చేశారు. కంపెనీ వ్యర్థ జలాలు సముద్రంలోకి విడిచి పెట్టడంతో మత్స్య సంపద నశించి తమంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య శాశ్వతంగా పరిష్కారం అయ్యేవరకు ఆందోళన కొనసాగిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ విశాఖపట్నం రూరల్ ప్రోగ్రాం కమిటీ మెంబర్ పిక్కి స్వామి, మైలపల్లి బాబ్జి, గోసాల స్వామి, మైలపల్లి గిరీష్, మైలపల్లి శివాజీ, కందాల నాగరాజు, చొడపల్లి తాతాజీ పాల్గొన్నారు.

అయ్యన్నకు పలువురు సంఘీభావం

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్: మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్న పాత్రుడును శనివారం రంపచోడవరం టీడీపీ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు శివాజీ రాజు నర్సీపట్నంలో పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు ఆర్గనైజింగ్ సెక్రటరీ మాగాపు బాబురావు, రంప చోడవరం మండల అధ్యక్షులు కారం సురేష్‌బాబు, గంగవరం మండల అధ్యక్షులు పాము అర్జున్, రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి కనిగిరి రాంబాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గోళ్ళ చంటిబాబు, అరకు పార్లమెంట్ బిసి సెల్ కార్యదర్శి ముచ్చు నాగేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షులు లంక హరిబాబు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వై.నిరంజనదేవి, దేవీపట్నం ప్రధాన కార్యదర్శి ఎట్టా మెహర్బాబాగౌడ్, గంగవరం మండల ప్రధాన కార్యదర్శి భాను ప్రకాష్, సింహాద్రి రాంబాబు, జడ్పిటిసి మాకాడ బుల్లమ్మ, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణి, సర్పంచ్ వంతల అచ్చియమ్మ, ముప్పన సావిత్రి, కారం పోచమ్మ, కొండపల్లి వెంకటలక్ష్మి, గంగిరెడ్ల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు కూడా సంఘీభావం తెలిపి అయ్యన్నకు మద్దతు తెలిపారు. ఆయనతో పాటు వాసే మురళి, గోకవరపు సునీల్ రెడ్డి, అప్పారావు, బూరడ మధు, ఆర్నే



అయ్యన్నను కలిసిన నాయకులు

పల్లి పాండురెడ్డి, షణ్ముక్ శౌంరి, రామకృష్ణ, పోలాసి ఉమా, నిమ్మగడ్డ కృష్ణారావు, గండికోట గోపి, వంగపండు ఆదినారాయణ, గోవాడ శివ, నున్నా పృథ్వి, సూరపనేని వంశీ, దొండపాటి మహేష్, ఈగ బాజి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో

విఆర్ఓ రాజేష్ సత్తా



ప్రజాశక్తి-కొత్తకోట: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి జావెలిన్ త్రో పోటీలలో రావికమతం మండలం జడ్. కొత్తపట్నం గ్రామ రెవెన్యూ అధికారి (విఆర్ఓ) ఆర్.రాజేష్ సత్తా చాటాడు. ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి విజేతగా నిలిచారు. గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆయన పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. రాష్ట్రస్థాయిలో 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా 33.04 మీటర్లు దూరం జావెలిన్ త్రో విసిరి రికార్డు నెల కొల్పాడు. గతవారం విశాఖలో జరిగిన సెలక్షన్ పోటీల్లో 33.0 మీటర్ల దూరం జావలిన్ త్రో చేసి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ప్రతిభ కనపరిచిన రాజేష్‌ను రావికమతం తహసిల్దార్ మహేశ్వరరావు, డిప్యూటీ తహసిల్దార్ శేషు నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ విఆర్ఓల సంఘం ప్రధాన కార్యదర్శి బూరవు సత్తిబాబు, మండల విఆర్ఓల సంఘం ప్రతినిధుల బృందం అభినందించారు.

ఇంటిపాలెం రహదారి అస్తవ్యస్తం

మరమ్మతు చేపట్టాలని గ్రామస్తులు వేడుకోలు

ప్రజాశక్తి-చీడికాడ: మండలంలోని తునివలస పంచాయతీని ఆనుకొని ఉన్న ఇంటిపాలెం గ్రామం రహదారి అస్తవ్యస్తంగా మారడంతో నానా ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు భీమన దొర, తదితరులు విలేకర్ల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ సమస్యను అధికారులకు, నాయకులకు పలుమార్లు తెలిపామన్నారు. సుమారు 6 నెలల క్రితం తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని, మండల నాయకులు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ సభ్యులు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారని తెలిపారు. నేటికి ఆరు నెలలు కావస్తున్నా రోడ్డు నిర్మాణం పనులు చేపట్టలేదని, దీంతో గ్రామస్తులు బయటకు వెళ్లాలన్నా, గ్రామానికి రావాలన్నా అనేక ఇబ్బందులు పడుతున్నారని భీమన్న దొర ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అస్తవ్యస్తంగా రహదారి



నగదు అందజేస్తున్న టైలర్లు

టైలర్ల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గొలుగొండ: సాటి సంఘ సభ్యుడు టైలర్ వృత్తిని కొనసాగిస్తూ ఆకస్మికంగా మృతి చెందటంతో సహచర టైలర్లంతా ఏకమై ఆర్థిక సాయం అందించారు. మండలంలోని పాతకేడీపేట గ్రామానికి చెందిన నీలం చిట్టిబాబు ఏళ్ల తరబడి టైలర్ వృత్తి చేస్తున్నాడు. ఆయన పది రోజుల క్రితం మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. అల్లూరి సీతారామరాజు టైలర్ అసోసియేషన్ సంఘం సభ్యులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.3వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో టైలర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గండేపల్లి రాజు, కార్యదర్శి ఏసుబాబు, మల్లికార్జునరావు, సత్యమూర్తి పాల్గొన్నారు.

నేడు బిఎస్‌పి మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గొలుగొండ: ఈ నెల 13న బహుజన సమాజ్ పార్టీ (బిఎస్‌పి) గొలుగొండ మండల కమిటీ ఎన్నిక జరుగుతుందని ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొట్టా నాగరాజు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, పార్టీ బలోపేతం కొరకు నియోజకవర్గంలోని అన్ని మండలాల కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని, వచ్చే ఎన్నికల నాటికి ప్రధాన పోటీలో నిలువడమే లక్ష్యమన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుండి కార్యకర్తలు మధ్యాహ్నం 2గంటలకు రావాలని సూచించారు.

జనసేన నేతల నిరసన

టిడ్కో, జగనన్న కాలనీల్లో అవినీతిపై పోరాడుతామన్న నేతలు



నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు నర్సీపట్నం మున్సిపాలిటీలోని టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో జగనన్న ఇళ్లు.. పేదల కన్నీళ్లు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టిడ్కో ఇళ్ల వద్ద నిరసన చేశారు. అనంతరం జగనన్న కాలనీ లే అవుట్లను పరిశీలించి అక్కడ ప్రస్తుత పరిస్థితులను పలువురు లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ నెలకొన్న అసౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, 9వ వార్డు కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య, చెట్టుపల్లి నాయకులు చలపాక కృష్ణ, సామాల ప్రసాద్, గొలుగొండ మండల అధ్యక్షులు గండం దొరబాబు, సీనియర్ నాయకులు రేగుబళ్ల శివ, 'నాతవరం మండలం యూత్ అధ్యక్షులు బైన మురళి, లంక పాత్రుడు, వేగిశెట్టి శ్రీను, చెప్పా నానాజీ, నాతవరం మండలం ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొన్న పోతురాజు, బాలేపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని సత్యనారాయణపురం మెగా లేఅవుట్ టిడ్కో గృహాలు, వేట జంగాలపాలెం, కూండ్రం గ్రామాల జగనన్న ఇళ్ల లేఅవుట్లను జనసేన నేతలు పరిశీలించారు. జగనన్న ఇళ్ల కాలనీలో అవకతవకలపై జనసేనాని పవన్‌కళ్యాణ్ పిలుపుమేరకు శనివారం ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు పరుచూరి భాస్కరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ పరిశీలించారు.. 'జగనన్న ఇల్లు, పేదలందరికీ కన్నీళ్లు' పేరిట మూడు రోజుల కార్యక్రమాల అనంతరం దీనిపై పవన్‌కు నివేదిస్తామని వారు తెలిపారు.

జోరుగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - రావికమతం: మండలంలో కవగుంట పంచాయతీ సర్పంచ్ దాసరి సూర్య కుమారి వరహాలు ఆధ్వర్యంలో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిని పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. ముందుగా చేతి బోర్లు, కుళాయిలు, నీటి బావులు, డ్రెయిన్‌లలో పేరుకు పోయిన చెత్తా చెదారాన్ని తొలగించేందుకు మొదటి ప్రాధాన్యతగా చర్యలు తీసుకోవడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. ఎస్సీ కాలనీ సమీపంలో చేతి బోరు, రచ్చబండ వద్ద పారిశుధ్య పనులు చేశామన్నారు.



చెత్త తొలగింపు పనులు

ప్రధాని సభ దృశ్యమాలిక

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు శనివారం ఎయు ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పలు జిల్లాల నుంచి ప్రభుత్వం జన సమీకరణ చేసింది. ఆయా గ్రామాల నుంచి వచ్చిన బస్‌లతో నగరం కిటకిటలాడింది. ఏర్పాట్లను అధికారులు, నేతలు పరిశీలించారు.


సభా ప్రాంగణానికి వస్తున్న ప్రధాని మోడీ


అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ, సిఎం జగన్


భారీగా తరలి వస్తున్న జనం


గస్తీ కాస్తున్న హెలీకాప్టర్


చిన్నారితో వచ్చిన మహిళ


సభకు వస్తున్న మంత్రి అమర్; ఎంపీ, ఎమ్మెల్యేలు


తరలి వచ్చిన ప్రజలు


సభా వేదిక సమీపాన ఆర్‌టిసి బస్‌లు, వాహనాలు


అభిమానుల కేరింతలు..

'ఉక్కు' నిరసనలు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ, రాష్ట్రానికి అన్యాయం చేసిన ప్రధాని మోడీ రాకను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన విశాఖలోని మద్దిలపాలెంలో ఆందోళన చేపట్టారు. వివిఎస్.కృష్ణా కాలేజీ రోడ్డు నుంచి మద్దిలపాలెం వైపు నిరసనకారులు ప్రదర్శన చేపట్టగా పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. ఆందోళనకారులు మద్దిలపాలెం జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. 40 మందిని పోలీసులు అరెస్టు చేశారు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ మెయిన్‌గేటు, బిసి గేటు వద్ద విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, కార్మిక సంఘాల ఆధ్వర్యాన భారీ నిరసన కార్యక్రమాలు జరిగాయి.


స్టీల్ మెయిన్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు


స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద నినదిస్తున్న సిహెచ్. నర్సింగరావు, స్టీల్‌ప్లాంట్ కార్మికులు


కార్పొరేటర్ గంగారావు, పోలీసుల మధ్య వాగ్వాదం


మానవహారం నిర్వహిస్తున్న ఉక్కు నాయకులు


మహిళా నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు


మద్దిలపాలెం వద్ద కుమార్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు



మద్దిలపాలెంలో ర్యాలీ చేస్తున్న నాయకులు